Lyrics: (కరుణశ్రీ) జంధ్యాల పాపయ్యశాస్త్రి

కుంతీకుమారి

అది రమణీయ పుష్పవన-మావన మందొక మేడ-మేడపై నది యొక
మారుమూల గది-ఆ గది తల్పులు తీసి మెల్లగా పదునయిదేండ్ల
యీడుగల బాలిక-వోలిక రాచపిల్ల-జంకొదవెడి కాళ్ళతోడ
దిగుచున్నది క్రిందికి మెట్లమీదుగా!

ఆ అమ్మాయి యిటువైపే వస్తున్నది .....
ఆమె కీ నది వద్ద ఏం పనో?

కన్నియ లాగె వాలకము కంపడుచున్నది కాదు కాదు ఆ
చిన్ని గులాబి లేత యరచేతులలో పసిబిడ్డ డున్న య
ట్లున్నది యేమి కావలయునో గద ఆమెకు యచ్చుగ్రుద్దిన న
ట్లున్నవి రూపురేఖ-లెవరో యనరా దతడామె బిడ్డమే!

ఆమె సంతోష పడుతున్నదా లేక దుఃఖిస్తున్నదా?

దొరలు నానంద బాష్పాలో పొరలు దుఃఖ
బాష్పములో గాని యవి గుర్తుపట్టలేము;
రాలుచున్నవి ఆమె నేత్రాలనుండి
బాలకుని ముద్దు చెక్కుటద్దాల మీద!

ఓహో! తెలిసింది....

గాలి తాకున జలతారు మేలిముసుగు
జారె నొక్కింత యదిగో! చిన్నారి మోము!
పోల్చుకొన్నాములే! కుంతి భోజపుత్రి
స్నిగ్ధ సుకుమారి యామె కుంతీకుమారి!!

"ముని మంత్రమ్ము నొసంగనేల? ఇడెబో మున్ముందు మార్తాండు ర
మ్మని నే కోరగనేల? కోరితిని బో యాతండు రానేల? వ
చ్చెను బో కన్నియనంచు నెంచక ననున్ జేపట్టగా నేల? pa
ట్టెను బో పట్టి నొసంగనేల? అడుగంటెన్ కుంతి సౌభాగ్యముల్"

"అయ్యో భగవానుడా!"

"ఈ విషాదాశ్రువుల తోడ ninka నెంత
 కాలమీ మేను చూతు? గంగాభవాని
 కలుష హారిణీ యా తల్లి కడుపులోన
 కలిసి పోమెద నా కన్న కడుపుతోడ"

ఈ విధంగా నిశ్చయించుకొని బిడ్డను రొమ్ముల్లో అదుముకుంటూ
 కుంతీకుమారి నదిలోకి దిగి పోతున్నది .... ఇంతలో....

నదీ తరంగాల్లో తేలుతూ ఒక పెట్టె అక్కడికి కొట్టుకుని వచ్చింది...
కుంతీకుమారి కన్నుల్లో ఆశా కిరణాలు మెరసాయి. 'ఈశ్వరేచ్ఛ ఇలా ఉన్నా
 దని గుర్తించింది. ఆమె ఆత్మహత్యనుంచి విరమించుకుంది. పెట్టెనిండా
 ఒత్తుగా పూలగుత్తులు, చిగురుటాకులు పేర్చింది. మెత్తగా పక్క
 దిద్దితీర్చింది. ఒత్తుకోకుండా చేత్తో ఒత్తి చూచింది ...

బాష్పముల సాము తడిసిన ప్రక్క మీద
 చిట్టిబాబును బజ్జుండ బెట్టె తల్లి.
"భోగ భాగ్యాలతో తులదూగుచున్న
 కుంతి భోజుని గారాబు కూతురు నయి
 కన్న నలుసుకు ఒక పట్టె డన్నమైన
 పెట్టుకో నోచనైతి పాపిష్ఠిదాన."

"నా చిట్టి బాబూ!"

"పెట్టియలోన నొత్తిగిల బెట్టి నినున్ నది గంగలోనికిన్
 నెట్టుచు నుంటి తండ్రి! యిక నీకును నాకును ఋణంబుదీరె; మీ
 దెట్టుల నున్నదో మన యదృష్టము! ఘోరము చేసినాను నా
 పుట్టుక మాసిపోను! నిను బోలిన రత్నము నాకు దక్కునే!"

అయ్యో తండ్రీ!"

"పున్నమ చందమామ సరిపోమెడి నీ వరహాల మోము నే
 నెన్నటికైన చూతునె! మరే! దురదృష్టము గప్పికొన్న నా
 కన్నుల కంత భాగ్యమును కల్గునె? ఏమమమైన యింత నీ
 కన్నము పెట్టి యూమూవిడినప్పటి మాట గదోయి నాయనా!"

"తల్లీ! గంగాభవానీ!"

"బాల భానుని బోలు నా బాలు నీదు
గర్భమున నుంచు చుంటి గంగా భవాని!
వీని నేతల్లి చేతిలోనైన బెట్టి
మాట మన్నింపు మమ్మ! నమస్సు లమ్మ!"
మరులు రేకెత్త బిడ్డను మరల మరల
నెత్తుకొనుచు పాలిండ్లపై నొత్తుకొనుచు
బుజ్జగింపుల మమకార ముజ్జగించి
పెట్టెలోపల నుంచి జోకెట్టె తల్లి.

ఆమె మాతృహృదయం తటపట కొట్టుకుంటున్నది పాపం ...

ఆత పత్రమ్ము భంగి కంజాత పత్ర
మొండు బంగారు తండ్రిపై నెండ తగుల
కుండ సంధించి ఆకులోనుండి ముద్దు
మూతిపై కడపటి ముద్దు నునిచి
"నన్ను విడిచి పోవుచుండె మా నాన్న" యనుచు
కరుణ గద్గద కంఠియై కంపమాన
హస్తముల తోడ కాంక్షలల్లాడ కనులు
మూసికొని నీటిలోనికి ద్రోసె పెట్టె.

నదీ తరంగాల్లో పెట్టె కొట్టుకొని పోతున్నది .....

ఏటి కెరటాలలో పెట్టె మేగుచుండ
గట్టుపై నిల్చి అట్టె నిర్ఘాంతపోయి
నిశ్చల నిరీహ నీరస నిర్నిమేష
లోచనమ్ములతో కుంతి చూచుచుండె.

"బాబూ ... బాబూ ... మా నాన్నా ... నాన్నా ...."
